# సీతాఫలాలు

నేను కొన్ని విషయాలలో బుద్ధిమంతుణ్ణి. నాకు తేగలూ, ముంజెలూ, వేరుశెనక్కాయలూ—యిలాటివి సయించవు. వాటిని నా దగ్గిరకి రానివ్వను. పురహా పట్నంలో చదువు వెలగబెడుతున్న రోజులలో, తోపుడు బళ్ళతో వేరుశెనక్కాయలు ప్రతి సినీమా థియేటర్ ముందూ కనిపించేవి. నాతోటి వాళ్ళు చాలామంది వేరుశెనగ గింజలు నములుతూ పిక్చర్ చూసేవారు. వాళ్ళు కటకట మనిపిస్తున్నప్పుడల్లా నాకు మహా చీకాకుగా వుండేది.

ముంజెలు ఒకసారి మా మరదలు కాబోలు పెడితే తిన్నాను. మా బావ యిలాటి తిళ్ళు తినరని శాంతాదేవి చెబుతున్నప్పటికీ, మా మరదలు—పాపం—లేత లేత—ముంజెలు ఎంతో జాగర్తగా వొలిచి, వాటిని ఒక వెండి పళ్ళెంలో పెట్టి, వాటిమీద కాస్త పంచదార చల్లి, ఒక స్పూనూ, ఆ వెండిపళ్ళెం పట్టుకొచ్చి, నా ముందువుంచి,—బావుండకపోతే వొదిలెయ్యవచ్చు—రుచి చూడమంది. మరదలు మనసు నొప్పించడం యిష్టం లేక తిన్నానేగాని, శాంతాదేవి వూరుకుందా? 'కాయల పాళంగా వుండగా బొటనవేలుతో కంట్లో పొడిచి, జుర్రున పీల్చాలిగాని-యిదేం తిండి!' అని వేళాకోళం చేసింది. పళ్ళెం ఖాళీ అయేదాకా

మరదలు నా పక్షమే వుందిగాని, ఆ పైన అక్కగారివేపు చేరింది.

ఇక రేగలు అంటారా ?—అవెప్పుడూ నేను తినలేదు, తినబోను. 'నేరేడు పళ్ళు,' వుసిరి కాయలు, జామకాయలు- యిలాంటివి తినకుండా మీరెలా పెద్దవారయారు. మీ అమ్మ గారు, బహుశా, మరమరాలు, పీచుమిఠాయి కొనిపెట్టి వుండాలి చిన్నప్పుడు ?'' అని మహా వెటకారంగా మాతి తిప్పుకుంటుంది శాంత.

అవును, నన్ను చిన్నప్పుడు మావాళ్ళు జాగ్రత్తగా పెంచారు. చిరుతిళ్ళు తినకూడదనీ, ఏ రోజుపాఠాలు ఆ రోజు చదువుకోవాలనీ చెప్పేవారు. నేను వారు చెప్పినట్లు నడుచు కోవడం వల్లనే ఒక యిల్లూ—వాకిలీ ఏర్పడటం, పదిమంది చేతా సత్పురుషుడని అనిపించుకోడం, నాలుగు డబ్బులు కళ్ళకి కనిపించడం—మొదలైనవన్నీ జరిగాయి.

సీతాఫలాలు కూడ నా బ్లాక్ లిస్టులోవే! సీతాఫలాలు తింటే మన్యపుజ్వరం వస్తుందని మా అమ్మ చెప్పేది. అదీ గాక, యిలాంటి పళ్ళెప్పుడూ మా యింట్లో కొనడం ఎరగను. ఏదో మామిడి పళ్ళు, ఆపిల్స్, ద్రాక్ష, దానిమ్మ—వగైరా ఫలజాతులు ఎరుగుదుం గాని సీతాఫలాలు మాకు తెలియవు. 'దోరగా వున్న జామకాయ కొరుక్కు తినడం చేతకాదు. మీరూ చెప్తారు రుచులగురించి !' అని నవ్వేసి వూరు

కుంటుంది శాంత. ఆ నవ్వులోని ఈసడింపు చూసి ఒక్కొక్కప్పుడు నా కెంత కోపం వస్తుందో చెప్పలేను.

క్రికెట్ మాచ్ చూడటానికని వచ్చిన శాంతాదేవి అన్నగారు, క్రికెట్ చూసి, సాయంత్రం వేళ యింటికి వస్తూ, అరడజను సీతాఫలాలు, కాయితంలో పొట్లం కట్టుకు తీసుకు వచ్చాడు. పొట్లం యింట్లోకివచ్చిందో లేదో యిద్దరూ చెరో మూడూ యిట్టే వూడేశారు. సీతాఫలాలు తింటూ సీతమ్మ వారి గురించిన కథకూడా ఒకటి చెప్పింది శాంతాదేవి.

కమలాక్షునర్చించు కరములుకరములా లా, సీతాఫలాల రుచి తెలియని జిహ్వకూడా ఒక జిహ్వయేనా—అన్నట్లుగా మాట్లాడాడు శాంతాదేవి అన్నగారు. క్రికెట్ మాచ్ అయిపోయి వాళ్ళవూరు వెళ్ళిన తర్వాత, సోదరికి బుట్టెడు సీతాఫలాలు పంపుతానన్నాడు.

"తప్పకుండా పంపు, అన్నయ్యా. మనవైపు సీతాఫలాలు తిని ఎన్నేళ్ళయిందో! మనవేపు పళ్ళతో పోలిస్తే, యివి ఏపాటి?–వొట్టి పిండెల్లా వున్నాయి ఇప్పుడిలాగే అంటావ్, పంపుతానని, అక్కడి కెళ్ళాక–వొదినా పిల్లలూ—ఆ ధ్యాసలో పడిపోయి, మళ్ళీ మెడ్రాస్ వచ్చేదాకా, మా సంగతే మర్చిపోతావు," అంది శాంతాదేవి. అటు అన్నగారు, ఇటు చెల్లెలు. అనడం, పడటం–యిద్దరికీ విధాయకం. నేను జోక్యం కలిగించుకోడం మంచిపని గాదనుకుని, 'ఏన్ ఆర్టికల్ ఎ

అన్న రీడర్స్ డైజస్ట్‌లోని పథ్యాన్లగవ ఆర్టికల్ చూస్తూ కూచున్నాను.

* * * *

ఈవెనింగ్ ఇన్‌పారిస్ పరిమళంలో కలిసిపోయే చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, 'ఏమండీ, శాస్త్ర పెందరాళే వస్తా రనుకున్నాను. పళ్ళ బుట్ట వచ్చింది యివ్వాళ,' అని శాంతా దేవి అనేవరకూ ఆ సీతాఫలాల సంగతే మర్చిపోయాను.

'అన్నమాట నిలబెట్టుకున్నాడే మీా అన్నయ్య!' అన్నాను.

'మా అన్నయ్య ఎప్పుడూ మాటతప్పడు.'

మాటతప్పుతాడని అన్నదీతనే, తప్పడని అంటున్న దీతనే, ఇవి నిలవదీసి అడగకూడని విషయాలు. తెలిసీ తెలియనట్లు వూరుకోవాలి.

సీతాఫలాలకి ఒక ప్రత్యేకమైన వాసన ఉంటుంది; నర వాసన—అని బ్రహ్మరాక్షసి అంటుందే, ఆ మాదిరివాసన. స్నానంచేసి, టీ తాగుతూండేవేళకి కూడా ఆ వాసన రాక పోవడం గమనించి, 'పళ్ళబుట్ట ఎక్కడ పెట్టావ్?' అన్నాను.

శాంతాదేవి ఒక్కసారి నా మొహం వంక సీరియస్‌గా చూసి, చంద్రకిరణం లా నవ్వి, 'మీాలాటి మహానుభావుడే రామాయణమంతావిని రాముడికిసీత ఏమవుతుందని అడిగాడట,'' అంది.

నా కప్పటికీ అర్థం కాలేదు. పార్సిల్ స్టేషన్‌కి రాగానే యస్. ఆర్. వి. యస్. యింటికి తీసుకువచ్చి వొప్పజెప్పేస్తారు. పెరిషబుల్స్—అనగా పళ్ళూ కాయలూ అయితే, ఒక్క పూట కూడా ఆలస్యం చెయ్యరు. ప్రతి రయిల్వే స్టేషను లోనూ అధమం అరడజను వాలుపోష్టర్లు, పార్సిల్ మీద యడ్రసులు పూర్తిగా విస్పష్టంగా రాయమని వుంటున్న ప్పుడు, శాంతాదేవి అన్నగారు సగం సగం అడ్రసు రాస్తా డని ఎలా అనుకోగలను ?

శ్రీమతి రయిల్వే రశీదు నాచేతి కిచ్చింది. అందులో మావాడు అడ్రస్ పూర్తిగా రాయించక, పొడిఅక్షరాలతో గిలికించాడు. అన్నగారు పంపిన సీతాఫలాలు కాసినీ, రయిల్ స్టేషన్‌లో వాళ్ళు వంతుల ప్రకారం పంచుకు తింటా రేమో అన్నట్టుగా మొహంపెట్టి, 'అయితే పళ్ళబుట్ట మనకి సరిగా చేరదంటారా ?' అంది.

"చేరుతుంది. కాని..." మొగ మహారాజులా చెప్ప బోయాను.

"చేరుతుందిగదా. రేపుపొద్దున్నే మీరు స్టేషన్‌కివెళ్ళి మాట్లాడి ఆ బుట్ట పట్టుకొద్దురూ !"

"ఆఫీసో ?"

"ఎంతసేపు పడుతుందండీ సెంట్రల్‌కి వెళ్ళి వచ్చేందుకు ? పళ్ళబుట్ట యింట్లోపడేసి, ఆఫీసుకి వెళ్దురుగాని"

సరే—అన్నాను. మార్గాంతరం ఏముంది గనక !

“మర్చిపోయాను. సుమతికి ఒక కార్డురాసి పడేదాం. మన సందుచివర వున్న డబ్బాలో యిప్పుడు పడేస్తే, తెల్లారే టప్పటికి అందుతుంది. సుమతికి సీతాఫలాలు ఎంత యిష్టమనుకున్నారు! చదువుకునే దినాల్లో మేమొకరోజున ఆరేసి పళ్ళచొప్పున తిని......చెప్పను బాబూ, ఆపైన చెప్పతారు.”

“ఆరేసి పళ్ళచొప్పున తిని వారంరోజులు జ్వరం పడ్డారు, చెప్ప ?”

“ఛట్ ఎంతమాటన్నారూ, జ్వరమా! గొంతుక పోయింది. కొత్త చింతకాయ పచ్చడి వేసుకుతింటే గొంతుక పోతుందే, అలాగ! అప్పటి కింకా మాకు తెలియదు, సీతాఫలాలు తిన్న వెంటనే విరుగుడుకి మంచినీళ్ళు తాగాలని. వేరుశనగకాయలు తింటామూ, అవి తిన్న వెంటనే విరుగుడుకి కాస్త బెల్లంముక్క నోట్లో వేసుకుంటే సరి. సీతాఫలాలకి మంచినీళ్ళు, వేరుశనక్కాయలకి బెల్లం, మామిడి పళ్ళకి మజ్జిగ...”

శాంతాదేవి ఒక లిస్టు యివ్వబోతూండగా ఆపి, ‘స్కూలుఫైనలు పరీక్షకి నువ్వు పంచతంత్రం చదువు కున్నావు కదూ?’ అని ప్రశ్నించాను.

“ఏం—అలా అడుగుతున్నారు?” అంది సాలోచనగా.

“ఆఁ ఏమీలేదు. అడుసు త్రొక్కనేల, కాలు కడుగ నేల?”

ఈమధ్య మద్రాసు గోడ లన్నిటిమీదా కనిపించిన ఒక తమిళచిత్రం తాలూకు వాల్‌పోస్టర్లోకి మల్లే నా చెవి పట్టుకో బోయింది. కాని ఆమెని ప్రసన్నురాలిగా చేసుకు, మాటలు తప్పించాను.

"స్కూలు టీచరు ఒక్కర్తెనే పిలిస్తే ఎలా? సుమతినీ, సుమతి బావగారినీ (ముకుందంగారు), సుమతి అక్కగారినీ; వారిపిల్లలనీ కూడా పిలు. నాకు మా పుట్టింటివారు బుట్టెడు సీతాఫలంబులు పంపినారు గాన, తమ కుటుంబం యావన్మందీ విచ్చేసి, వాటిని భుజించి, మమ్మానందింపజేయ గోరు చున్నాను—ఇవియే అనేక శుభలేఖార్థములు — అని రాయి."

"మీకంతా ఆటలుగా వుంది. చెబుతాను వుండండి" అని మొదటి వార్నింగ్ యిచ్చింది శాంతాదేవి.

* * * *

సుమతికి శుభలేఖ రాయలేదుగాని అర్జెంటా కార్డు వ్రాశాం. సీతాఫలాలు తినడానికని రాయలేదుగాని, ఆరు న్నూరైనా, అటు సూర్యుడిటు పొడిచినా, తప్పక రావల సిందనీ, కొంప మునిగిపోయేపని అనీ రాశాం.

రోజూకంటె కాస్త తొందరగా లేచి, స్నానం కాఫీ ముగించుకుని, సెంట్రల్ స్టేషన్‌కి బయలుదేరాను. నేను పార్సిలాఫీసుకి వెళ్ళీవెళ్ళగానే, ఒకబ్బాయి వొచ్చి, నా చేతిలోనుంచి రశీదు లాక్కుని, అక్కడ కుప్పతిప్పలుగా

పడివున్న పార్సిల్స్‌లో ఒకదానిమీద సుఖంగా కూచో మన్నాడు. ఆ పోర్టరు నా రశీదు పుచ్చుకు పారిపో లేడని తెలుసు కాబట్టి, నిశ్చింతగా కూచుని క్లాసిఫైడ్ కాలమ్స్ లోని రియల్ ఎస్టేట్స్ చదువుకుంటున్నాను. రెండు ఫ్లాటీ దగ్గిర, ఒకటి కొడైకెనాల్లో, మరొకటి బెంగుళూర్లో అమ్మ కానికి సిద్ధంగా ఉన్నాయి. మనది స్వప్నమని తెలిసినప్పుడు, ఆ స్వప్నం బ్రహ్మాండమైనదైతేనే ఖేషుగ్గా ఉంటుంది. అప్పుడు స్వప్నాంచలాలమీద సులువుగా తేలిపోవచ్చు. మనదగ్గిర నిజంగా డబ్బుంటే రియల్ ఎస్టేటు గురించి ఎందుకు ఆలోచిస్తాం ?

పావుగంట పోయాక పోర్టరు ప్రత్యక్షమై, మా పళ్ళబుట్ట రాలేదన్నాడు. నేను నమ్మలేకపోయాను. స్వయంగా అన్ని గదుల్లోనూ అడుక్కుంటూ పోయాను. ఒక క్లర్కు దయ దలిచి చెప్పాడు: 'ఇది అప్పుడే ఎక్కడ వస్తుంది, సార్, యింకో రెండురోజులు పోవాలి.''

''పెరిషబుల్స్ గదా !'' అన్నాను.

''అందుకనే యింకో రెండు రోజుల్లో వస్తాయి,'' అని ఆ క్లర్కు తన పనిమీద వెళ్ళిపోయాడు.

ఈ విషయమై సంపాదకలేఖ ఒకటి రాసిటీరా లను కుంటూ మరొక రూమ్‌లోకి వెళ్ళాను. అక్కడ వున్న గుమాస్తా కాస్త ధైర్యం చెప్పాడు: 'పదకొండు గంటలకి వచ్చే బండిలో మీ పార్సిల్ రావచ్చు'' అన్నాడు. కొం

డంతబరువు దించినట్టయింది. పోర్టరుకి ఒక పావలా డబ్బులు చేతిలో పెట్టి యస్. ఆర్. వి. యస్. రూమ్‌లోకి వెళ్ళి రశీదు వారికి వొప్పజెప్పి, పార్సిల్ రాగానే మా యింటికి పంప మన్నాను.

"ఇవ్వాళ వస్తే, యివ్వాళ పంపుతాం. రేపు వస్తే, రేపు పంపుతాం. మీకా దిగులు ఏమీ అక్కర్లేదు. అది రావ డమే తరువాయి, రాగానే మీకు పంపుతాము" అని ఎంతో వినయంగా చెప్పారు. యస్. ఆర్. వి. యస్. బతుకుజీవుడా—అని బయటపడ్డాను. అప్పటి కప్పుడే తొమ్మి దింపావు అయింది.

అన్నం వడ్డిస్తూ అడిగింది శాంత : 'మీరు స్వయంగా చూశారా అక్కడ పడివుండే పళ్ళబుట్టలన్నీ ?"

"చూడ్డకేం ! ఇంకారాలేదు. మధ్యాహ్నమో సాయిం త్రమో తప్పకుండా వచ్చేస్తుంది."

"ఏమో ! సీతాఫలాలు నిలవవుండవు కూడాను. పాడై పోతాయి. అంతకీ మా అన్నయ్య కాయలే ఏరి పంపించి వుంటా డనుకోండి."

ముక్కూ నోటా నాలుగు మెతుకులు వేసుకు, నా దారిని నేను ఆఫీసుకి పోయి, సాయింత్రం ఐదున్నరకి యింటికి వచ్చాను. శ్రీమతి ముఖమండలం తుమ్మల్లో పొద్దుగూకినట్టు లేదు గాని, చంద్రుడులేని ఆకాశంలా ఉంది.

"సుమతి వచ్చింది గాని సీతాఫలాలు రాలేదు. ఇప్పుడిప్పుడే వెళ్ళింది సుమతి."

"రేపు రమ్మనక పోయావా? రేపటికి తప్పకుండా వస్తాయి."

"రేపు మాత్రం వస్తాయని నమ్మక మేమిటి?"

శాంతాదేవి మొహంలో ఆ దిగులూ బాధా చూడలేక పోయాను. 'బుజం మీద తడుతూ రేపు తప్పకుండా వస్తాయి' అన్నాను సముదాయిస్తూ.

"నిజంగా?" అని అడిగింది. ఎంత జాలేసిందో చెప్పలేను.

"ఇంకోసారి స్టేషన్‌కి వెళ్ళి కనుక్కురండి," అని మర్నాడు పొద్దున్న మళ్ళీ నన్ను స్టేషన్‌కి పంపింది. మీరు వెళ్తేగాని వీల్లేదు—అని నన్ను దండించలేదు. కాని ఆమె వ్యాకులత చూడలేక, అడక్కుండానే స్టేషన్‌కి వెళ్ళేందుకు ఒప్పుకున్నాను.

"ఇవ్వాళ వస్తే, యివ్వాళ పంపుతాం. రేపు వస్తే రేపు పంపుతాం..." అని యింకా ఏదో చెప్పబోతూవుండగా ఆపి, 'పెరిషబుల్స్ గదా, యివాళ్టికికూడా రావా' అనడిగాను.

నూటికి తొంభయి వాళ్ళు యివ్వాళ రావడం ఖాయమనీ, మధ్యాహ్నం నేను ఆఫీసునించి యింటికి వెళ్ళేవేళకి పళ్ళబుట్ట రెడీగా ఉంటుందనీ చెప్పారు. శనివారం గనక నేను

రెండు కొట్టేటప్పటికి యింటికి వచ్చేశాను. సుమతీ, ఆమె ఫ్రెండు, మరొక అమ్మాయీ కూడా వచ్చివున్నారు.

"ఏమండీ, మీరు ఆఫీసునుంచి వచ్చేటప్పుడు పళ్ళబుట్ట పట్టుకొస్తారని అనుకున్నాం," అంది సుమతి.

"వుండండి. యింకో గంటలో వచ్చేస్తాయి," అన్నాను మొండి ధైర్యంతో.

"కనుక్కొచ్చారా మళ్ళీ?" అని అడిగింది శాంత.

"మీకెందుకు-చూస్తూవుండండి. యింకో గంటలో రాకపోతే అడగండి," అన్నాను ముగ్గురు స్త్రీలనీ వుద్దేశిస్తూ.

గంటా, రెండుగంటలు. గడియారం గణగణ నాలుగు కొట్టింది. పళ్ళబుట్ట వూడిపడలేదు. నాకు మహాకోపం వచ్చింది. ఏమిటి చెయ్యడం? ఎవరో వీధితలుపు తట్టేటప్పటికి పళ్ళబుట్ట అనుకున్నాం. కాదు, పనిమనిషి. పనిమనిషిని అంట్లగిన్నెలు తీసుకోమని, టీకి నీళ్ళు పడేసింది శాంతాదేవి. ఆమెముఖంలో ఎంత దిగులో చెప్పలేం.

టీ. సగం తాగుతూ తాగుతూ వుండగా శాబోలు, ఎట్టకేలకు సీతాఫలాల బుట్ట వచ్చింది. గుప్పున వాసన రావడంతో, 'పళ్ళు చాలా పాడైపోయి వుంటాయి,' అంది శాంతాదేవి.

ముగ్గురు స్త్రీలూ పనిమనిషీ కలిసి పళ్ళబుట్ట విప్పడం మొదలెట్టారు. కట్టిన తాళ్ళన్నీ విప్పి, మూత తెరిచేటప్ప

టికి, యిల్లంతా సీతాఫలాల వాసన కమ్ముకుంది. అది దుర్గంధమూ కాదు, సుగంధమూ కాదు; వెన్నంటి వేటాడే వాసన, లోపల పరిచిన ఆకులు తొలిగించి చూస్తే, పేరుకి ఒక్క పండుకూడా లేదు. అన్నీ చితికిపోయి, కుళ్ళిపోయి, పితపిత లాడుతున్నాయి. మా యింట్లో యెప్పుడూ లేనిది, వందలూ వేలూ ఈగలు జుమ్మని ముసురుకుంటూ వచ్చాయి. మొహం మీద కొడుతున్న ఈగలు, వొళ్ళు వెలపరించే వాసన-వాటితో శాంతాదేవికి ఏమిచెయ్యాలో తోచలేదు. ఆ బుట్టని బుట్టపాళంగా వీధిలో పారేసి రమ్మంది పనిమనిషితో. మా పనిమనిషి ఆ బుట్టని ఎత్తలేకపోయింది. ఒక చేట పుచ్చుకు, ఆ చేటలోకి పళ్ళబుట్టలోని పదార్థం ఎత్తడం వీధిలో పారపొయ్యడం మొదలెట్టింది పని మనిషి. ఈ మాదిరిగా నాలుగు చేటలు పారపోసిన తర్వాత, బుట్టని వీధిలో పారేసి వచ్చింది.

ఇక యింట్లో ఈ వాసన పోవడం ఎలా? ముందు ఫెనయిల్ చల్లి ఆ ప్రదేశమంతా కడిగించింది శాంతాదేవి. సీతాఫలాల వాసనముందు ఫెనయిల్ నిరుపయోగమయింది. తర్వాత డెట్టాల్ వాడాం. అదీ అంతంతే అయింది. యింట్లో వున్న సాంబ్రాణి అంతా వాడి, గుప్పెడు అగరువత్తులు వెలిగించింది. అప్పటికి వాసన కాస్త సద్దుకుంది. కాని గాలి వీచినప్పుడల్లా సీతాఫలాల వాసన కొడుతూండేది.

సుగంధ సామగ్రివల్ల యింట్లో వాసనతో పోరాడాము గాని, మావీధివీధంతా మర్నాడు మధ్యాహ్నం దాకా సీతాఫలాల వాసన కొడుతూనే వుంది. అదీ శాంతాదేవి అన్నగారు పంపిన పళ్ళబుట్ట పర్యవసానం.

మొన్నీమధ్య ఎవరో రెండు సీతాఫలాలు తీసుకొచ్చి ఇవ్వగా, శాంతాదేవి ఆరెండూ పనిమనిషికి యిచ్చేసింది.

"ఏం ?" అన్నాను.

"సీతాఫలాలు కాశిలోవదిలిపెట్టాను" అంది.

"కాశీ వెళ్ళకుండానే !"

"కాశీలో వొదిలి పెట్టేందుకు కాశీకి వెళ్ళాలా !"